# ప్రేమ కథ

రాజు మాయింటికి వచ్చినప్పటినుండీ పరిశీలిస్తున్నాను ఎప్పుడూ సరదాగా పిల్లలతో ఆడుతూ పాడుతూ ఉంటాడు. చిక్కగా దట్టంగా ఎదిగిన వెంట్రుకలు. గుండ్రని కళ్ళు. నొసటిలో బంగారువన్నె రేఖలు. అందాన్నంతా స్వంతం చేసుకొన్నట్లు కన్పించే ఆకారం. ప్రతి ఒక్కరినీ అట్టే ఆకర్షించే సౌందర్యం।

రాజుకు ఎక్కువ సంతోషం కలిగినప్పుడు చూడాలి. ఎక్కడ చూచినా వాడే. వంట గదిలో ఆరంభమైన ఆట తోటలో ప్రతి పూల మొక్కనూ ప్రదక్షిణంచేసే వరకూ జరుగుతుంది. చివరికి అలసిపోయి చిక్కిపోతాడు. చిట్టి మెత్తగా బుల్లి చేతులతో నాలుగు దెబ్బలు కొడుతుంది.

ఇట్లా పెరుగుతూవచ్చాడు. రాజు. వాడికీ యౌవనం వచ్చింది. అవును మరి। జీవితంలో మధురానుభూతులను అందించే మహత్తరమైన తరుణం అది. వాడికి పిల్ల కావాలి. వాని అందానికి తీసిపోకుండా ఉండాలి. సంసారాన్ని ఏ ఒడుదుడుకులూ లేకుండా చక్క బెట్టుకొనే వాకచక్య ముండాలి. చీటికీ మాటికీ కొట్లాడకుండా ఆనందంగా జీవితాన్ని సాగించ గల భాగస్వామిని కావాలి.

ఏ భాగ్యశాలి రాబోతుందో!

ఈ ఆలోచన నాకు ఉన్నట్టుండి స్ఫురించింది. నీ క్కాస్త విశ్రాంతి దొరికినపుడో రాజు వాలకాన్ని శ్రద్ధగా పరిశీలిస్తున్న నాకు ఈలాంటి

ఆలోచన కలగడంలో ఆశ్చర్యం లేదు. కానీ వచ్చిన చిక్కల్లా రాజుకు తగిన వధువును కుదర్చడంలోనే ఉంది.

రాజు కేమీ కట్నాలు అవసరం లేదు. చిల్లిగవ్వ పుచ్చుకోడు. కానుకలసలే అవసరం లేదు. భగవంతుడొసగిన సహజ సౌందర్యం ముందు ఎన్నివేల ఆభరణాలైనా సూర్యుని ముందు దివిటీలే. తిండికి ఏ లోటూ లేదు. ఏపూటకాపూట ఏదో విధంగా గడిచిపోతూనే ఉంటుంది. ఐనపుడు లక్షణమైన సంబంధాన్ని చూడడంలో ఏ చిక్కూ ఉండవలసిన అవసరం లేదు. కానీ ఎలా ఆరంభించాలి ఈ కన్యాన్వేషణ? ఎవరిని పంపాలి? ఎక్కడ చూడాలి?

ఈ సందర్భంలోనే ఇంకో విషయం కూడా జ్ఞప్తికి వచ్చింది. రాజుకు కుల భేదం లేదు. అసలు కులాలే లేవు. ఇది చాలా గొప్ప విశేషంగా కన్పించింది నాకు. నిజానికి మనిషికంటే గూడా రాజు గొప్ప వాడుగా కన్పించాడు. వాడికి కులం లేదు కనుక.

ఏదో విధంగా రాజుకొక పిల్లను కుదిర్చి తీరాలనుకొన్నాను. ఇట్లా అనుకొన్నప్పుడు "నువ్వేమనుకొన్నావ్?" అంటూ నాఆత్మ ప్రశ్నించింది. ఏమనుకొన్నాను?

పిల్లికి పెత్తనం వెళ్ళాలనుకొన్నాను.

పిల్లికి పెత్తనం వెళ్ళడమే! ఆత్మ ఆశ్చర్యాన్ని ప్రకటించింది. మళ్ళీ ఆలోచన.... మెదడు పనిచేయడం ఆరంభించింది. చిత్తం కూడా చురుకుదనం వహించింది.

చివరికొక నిర్ణయం జరిగింది నాలో. పిల్లికి పెళ్ళిచేయడమేమంత సులభమైన విషయం కాదు. ఐనా ఒకవిధంగా చాలా సులభమని కూడా తోస్తుంది. ఎందుకంటే యిందులో కట్నాలూ, కానుకలు, తదితర లాంఛ

నాలు లేవు. కులమూ గోత్రమూ ప్రసక్తులూ లేవు. ఈడూ జోడూ కుదిరితే చాలు.

బయలుదేరాను కన్యాన్వేషణకు. మా ప్రక్క వీధిలో శేఖరం ఉన్నాడు. దేనికైనా వాడి సలహా తీసుకోవడం మంచిదనిపించింది. పెళ్ళిళ్లు చేయడంలో వాడికి గొప్ప అనుభవముంది. వాడు కుదిర్చిన దాంపత్యాలు అచ్చిరాగలవని చాలమంది నమ్మకం. తీరా వాణ్ణి కలుసుకొని అసలు విషయం చెప్పగనే వాడు నన్ను ఆపాదమస్తకం పరిశీలించి నిన్నటివరకూ బాగానే మాట్లాడుతున్నావు గదూ! ఈ దినం పిచ్చివాడైనట్టుందే అన్నాడు. నాకూ అనుమానం వేసింది. అంతటి అనుభవజ్ఞుడు ఆ మాట అన్నప్పుడు నన్ను నేను ఒక్కసారి చూచుకొని, నన్ను నేను జ్ఞప్తికి తెచ్చుకొని మళ్ళీ స్థిరమైన నిర్ణయాన్ని తెలియ జేశాను.

"బాగుంది పనిలేనితనం నిన్నిలా చేయడం లేదు గదా" అన్నాడు శేఖరం.

"పని లేకేం. బోలెడంత పని ఉంది. ఇది కూడా ఒక పనే పైగా యిది చాలా అవసరమైన పని, ప్రయోజనం ఉన్న పని. ఈపనిలో తప్పేముంది? రాజు మంచివాడు కాడా? వాడెవరికీ ఎప్పుడూ అపకారం చేసి ఎరుగడు?" అన్నాను.

"నువ్వంత గట్టిపట్టుబడితే నీతో వాదించడం కష్టం. నన్ను ఒప్పించడమూ కష్టమే మా యింట్లో ఒక పిల్ల ఉంది. ఇల్లిల్లూ తిరగడం అసాధ్యం. ఈ పిల్ల నచ్చుతుందేమో చూడు" అంటూ లోపలికి వెళ్ళి పిల్లను తీసుకవచ్చాడు.

పరిశీలనగా చూశాను. పిల్ల బాగానే ఉంది. తెలుపు రంగు. గోధుమ వన్నె చారలు. మిలమిలలాడే చిన్ని కళ్ళు.

"కట్నం కానుకల మాట ఏమంటారు?" అన్నాను నవ్వుతూ.

"ఏడ్చావు. అసలు పిల్ల దొరికింది చాలక పైగా ఇదొకటీ?" అన్నాడు వాడు.

పిల్లను తీసుకొని చక్కా యింటికి వచ్చాను. కడపలో అడుగు పెడుతుండగనే కన్పించాడు రాజు.

"ఒరేయ్ రాజూ ఇలారా" అన్నాను.

వాడు రాలేదు సరిగదా మహా తీవ్రమైన ఒక్కచూపు చూచాడు. అమాంతం పిల్లమీద పడ్డాడు. చిటికెలో ఒక చిన్న యుద్ధం జరిగింది. కస్సు బుస్సుల ధ్వనులతో ఇల్లంతా మారు మ్రోగిపోయింది. శేఖరం ఇంటినుండి తీసుకవచ్చిన పిల్ల నాతో చెప్పకుండానే పారిపోయింది.

ఇంకేం చెయ్యాలి? బహుశా రాజు పెళ్ళి వద్దను కుంటున్నాడేమో! నేనే పొరబడ్డా ననిపించింది. కానీ రెండు నిమిషాలు గడువకముందే యింకో రాణి వచ్చిందక్కడికి. నిజంగా! ఆ పిల్ల అద్భుతంగా ఉంది. చూస్తూ చూస్తూ ఉండగానే రాజు ఆ రాణిని తీసుకొని వెళ్ళిపోయింది తోటలోకి. నాకు కోపం వచ్చింది. ఎందుకు రాదు? రాజును చిన్నప్పటి నుంచీ పెంచాను. చివరికి యిలాంటి అఘాయిత్యానికి పూనుకోవడం ఎంత తప్పు? పెద్దా చిన్నా అని ఆలోచించకుండా వాడిష్టంగా ప్రవర్తించడం బాగుందీ? పెళ్ళి అంటే నూరేళ్ళ పంట గదా? మంచి సాంప్రదాయం కలిగిన పిల్లను చేసుకొని నాలుగు కాలాలూ చల్లగా బ్రతకడం విడిచి యిదేం పొయ్యే కాలం? క్రమశిక్షణకే విరుద్ధంగా కన్పించింది. వాణ్ణి అదుపులో పెట్టకుంటే చెడిపోతా డనిపించింది. ఎదురుగా కన్పించిన దుడ్డుకర్రను అందుకొని పైకి లేచాను. చర చరా తోటలోకి వెళ్ళాను. అప్పుడు.... ఆ సమయంలో రాజు రాణిని ముద్దు పెట్టుకొంటున్నాడు. అంతవరకు వచ్చింది

కథ. ఇంకా వూరుకొంటే ఏం బాగుంటుంది? కర్రను విసరుదామని చేతిని పైకెత్తేలోగా "వద్దు వద్దు" అంటూ ఆత్మ హెచ్చరించిది. పిల్లిని చంపడం మహా పాతకం. అంతే కాదు. పిల్లిని కొట్టినపుడు రాలిన ఒక్క రోమానికి కోటి పాపాలు కల్గుతాయి. కాశికి వెళ్ళివచ్చినా కర్మం తీరదు. ఈ ఉన్న చిక్కుల్లో కాశికి ఎలా వెళ్ళడం? కొట్టకుండా తిట్టకుండా అహింసా సిద్ధాంతంతోనే రాజును మంచి త్రోవలో పెట్టా లనిపించింది. కర్రను క్రింద పడవేసి రాణిని తరిమాను. రాజు ఉగ్రుడై పోయాడు. ఒరి బాబూ కస్సు మంటూ పైపైకి వచ్చాడు. విసరి కొట్టాను. రాణి పారిపోయింది దానితోపాటు రాజు కూడా పరారైనాడు.

ఇంతే! ఎన్నాళ్ళు పెంచితే నేం! వాడు ఆలోచించలేదు సరిగదా ఎంతో కష్టపడి తీసుకవచ్చిన పిల్లను నిరాకరించాడు. ఏమైనా కానీ రాజుకు గుణపాఠం చెప్పా లనిపించిది.

ఆ రాత్రి రాజు మామూలుగానే కన్పించాడు. కాలు గాలిన పిల్లిలా అటూ యిటూ తిరుగుతున్నాడు. నేనేమీ పలుకలేదు. చిట్టి మాత్రం ఏదో మాట్లాడుతూ ఉంది. వాడి కేమీ తినడానికి యివ్వకండి అన్నాను పిల్లలతో. వాళ్ళు ఆదరిపోయారు. రాజు మాత్రం ప్రశాంతంగానే వంట గదిలోకి వెళ్ళిపోయాడు.

తెల్లవారగానే చక్కా శేఖరం యింటికి వెళ్ళాను. "నీ పిల్లి యింటికి వచ్చింది మళ్ళీ తీసుకెళ్ళుదామని వచ్చాను" అన్నాను. వాడేమీ మాట్లాడకుండా పిల్లిని తెచ్చి యిచ్చాడు. రెండు రోజుల నుంచి పిల్లుల మీద నేను చేస్తున్న పరిశోధనను వాడు పిచ్చి క్రింద జమకట్టేశాడు. నేనూ మాట్లాడకుండా పిల్లిని తీసుకొని వచ్చేశాను.

ఈమారు యింటికి రాగానే రాజా రాణి ఒక ఎలుక పిల్లతో

ఆడుకొంటున్నారు. నా చేతిలోని పిల్లను చూడగానే రాజు కస్సుమంటూ పైన బడ్డాడు.

అదిరిపోయి పిల్లను క్రింద పడవేశాను. మళ్ళీ ఒక యుద్ధం. ఈ యుద్ధం భయంకరంగా నడిచింది. ఇంట్లో వాళ్ళంతా చేరిపోయారు. పిల్లలంతా హడలెత్తిపోయారు. చివరికి నేనే తెగువచేసి కర్రతో రాజును తాకాను. ఉహూఁ నా దెబ్బలు లెక్క పెట్టలేదు. శేఖరం పిల్లిని తప్పించే లోగా తల ప్రాణం తోకకు వచ్చింది.

" ఇంట్లో రెండు పిల్లులున్నవి చాలక యింకో పిల్లి ఎందుకురా? " అన్నది అవ్వ.

" ఏం చెప్పాలి సమాధానం? "

" రాజుకు జంటగా ఉంటుందని తెచ్చానులే " అన్నాను.

" ఏడ్చినట్టుంది. దానికి జంటను నువ్వేమిటిరా తెచ్చేది. అది ఎప్పుడూ రాణితోనే ఉంటుందె " అన్నది అవ్వ.

" రాణి ఎక్కడినుండి వచ్చిందేం? " అన్నాను రెట్టిస్తూ.

" ప్రక్కింటి వాళ్ళ పిల్లిరా. పిల్లులతో చెలగాటం ఎందుకూ..... ఇంకేమైనా పనీ పాటా ఉంటేగా " అంటూ ఆరంభించింది అవ్వ.

నా ప్రయత్నమంతా బూడిదలో పోసిన పన్నీరై పోయింది.

నాకు తెలియకనే రాజు రాణిని ప్రేమించాడు. ఎన్నాళ్ళ నుండి జరుగుతున్నవో ప్రేమకలాపాలూ.... ప్రణయ సన్నివేశాలూ..... పెద్ద వారికి పెంచినవారికీ తెలియకుండా ఇలా ప్రవర్తించడం ఏం బాగుంటుంది?

అప్పటికి వూరుకొన్నాను. ఆవెనుక చాలా తీవ్రంగా ఆలోచించాను. " ప్రేమించడం పిల్లుల్లోకూడా ఉంది. "

"ప్రేమించిన వెనుక మనుష్యులు వదిలిపెట్టినట్లు పిల్లులు వదిలి పెట్టవు."

"పెద్ద వారికి భయపడి ప్రేమించిన పిల్లను అన్యాయం చేసే యువకునిలాగా పిల్లి చేయదు"

"ప్రేమించిన పిల్లకోసం పిల్లి ఎన్ని త్యాగాలైనా చేస్తుంది."

"ప్రేమ మానవులకంటే జంతువుల్లోనే ఎక్కువ ఉంది."

ఈ విధంగా నా పరిశోధనలను వ్రాసుకొన్నాను. ఆ కాగితాన్ని జేబులో దాచి సాయంకాలం శేఖరానికి చూపించాను. వాడు చదివి మొదట ఆశ్చర్యాన్ని ప్రకటించి చివరికి ఇంకా ముందున్నదిగా కథ అన్నాడు. వాడి పిల్లిని మళ్ళీ యిమ్మని అడిగాను. ఈ మారు వానికి కోపం వచ్చింది. "నా పిల్లి ఏమంత చౌకగాలేదు. నీ పిల్లికంటే చక్కని మొగుళ్ళు దానికి దొరుకుతారు. ఒకటి రెండుసార్లు మర్యాద. వల్లని మొగుడితో అదెట్లా కాపురం చేస్తుంది చెప్పు" అన్నాడు.

"ఏం ఎందుకు చేయగూడదు. మెడవంచి పుస్తెను కట్టమంటే సరి" అన్నాడు.

"కాదురా అబ్బీ! కాస్త విను. స్వేచ్ఛా, నీతీ నిజాయితీ లేని మానవ సంఘంలో మాత్రమే అలాంటి కాపురాలు చేయడం వీలవుతుంది. హృదయాలుండే జంతువులు నిరంకుశత్వానికి లోబడవు" అన్నాడు.

"మరొక్కసారి యివ్వరా. తుదిసారి. ఈమారు ప్రయత్నించి చూస్తాను" అన్నాను. వాడు సణుక్కుంటూ లోపలికి వెళ్ళి పిల్లిని తెచ్చి నా మీదికి విసిరేశాడు. ఆ పిల్లిని చంకలో పెట్టుకొని యింటికి వచ్చాను. దాన్ని చూడగానే రాజు మళ్ళీ కస్సుమంటూ ముందుకువచ్చి ఏమి తోచిందో

ఏమో తోటలోకి వెళ్ళిపోయాడు. శేఖరం గారి పిల్లిని యింట్లో వదలి పెట్టాను. చిట్టికి బాగా పరిచయమైంది. చిట్టితో ఆడుకోవడం ఆరంభించింది.

ఆశ్చర్యమేమంటే అసలు రాజు పత్తాలేదు. రాణీగూడా లేదు. ఈ రెండు పిల్లులూ ఏమైనట్టు?

రెండు మూడు రోజులు చూశాను ఉహూ వాటి జాడే కన్పించ లేదు. రాణి పక్కింటి పిల్ల గదా అక్కడేమైనా రెండూ ఉన్నాయేమో అనుకొన్నాను. గోడ అడ్డం వుంది. సాయంకాలం తొంగి చూశాను. రెండూ హాయిగా దోబూచులాడుకుంటున్నాయి.

"ఏయ్ రాజూ?" అన్నాను. వాడు తిరిగి చూశాడు. చాల నిర్లక్ష్యంగా రాణిని పిలుచుకొని లోపలికి వెళ్ళి పోవడమే!

ఏమనుకోవాలింక! ఇది ఎట్లా ఉందంటే నిర్బంధంగా ఒక పిల్లను ముడిపెడితే దానితో మీరే సంసారం చెయ్యండి బాబూ అంటూ వాడికి నచ్చిన పిల్లను లేవదీసుకొని వెళ్ళిపోయిన యువకుని కథలా ఉంది. వాడు మరీ నయం. దూరంగానైనా వెళ్ళిపోయాడు. రాజు అట్లాకాదే! ప్రక్కింటి లోనే కాపురం పెట్టుకొన్నాడు తాను వలచిన పిల్ల రాణితో. ఎట్లా వేగడం వీడితో! మొండి ఘటం!

ఏం చెయ్యాలింక? ప్రేమ ఉన్నతస్థాయి నందుకొన్నప్పుడు ఏలాంటి అవరోధాలను కల్పించి మాత్రం ఏం లాభం? మనిషైతే ఆస్తియివ్వనురా అని బెదిరించవచ్చు. లేదా మరెలాంటి నిర్బంధాలనో విధించి ఒత్తిడి చేయవచ్చు. మార్జాలంవద్ద యీలాంటి ఎత్తులు ఎన్నైతేనేం? వాడికేం రాజు! రాజులాగా వెళ్ళి యిల్లిటమే కూర్చున్నాడాయె. ఆస్తిపాస్తులతో నిమిత్తం లేదు. బ్రతుకు జరగదనే భయమూ లేదు. ఇల్లూ వాకిలీ లేదనే

దిగులూ లేదు. అంచేతనే దేనికైనా సిద్ధం అంటూ తీరి కూర్చున్నాడు రాజు.

మూడో రోజు శేఖరం మా యింటికి వచ్చాడు. వాడి పిల్లిని చూచి ఎక్కడరా నీ పిల్లి అన్నాడు. ఏం చెప్పను? పిల్ల నిచ్చిన వియ్యంకుని ఫోజులో కన్పించాడు నాకు శేఖరం. వాడి పిల్లను వదలి యింకోపిల్లతో కాపురం పెట్టాడు రాజు అని చెబితే నా పరువు ఉంటుందీ? దొంగకు తేలు కుట్టినట్లయింది నా పని. వాడి పిల్లి అమాంతంగా వాడి ఒళ్ళో వచ్చి కూచున్నది పెంచిన మమకారం! కన్న కూతురిని బుజ్జిగించినట్లు బుజ్జగిస్తు న్నాడు. కొంపదీసి అత్తగారి యింటి గుట్టును కాస్త అది బయటపెడితే ఏం చెయ్యాలి?

"ఎక్కడో ఉంది! అదే వస్తుంది" అన్నాను శేఖరంతో. కాఫీ త్రాగి వాడు వెళ్ళుతుంటే వాడి పిల్లి గూడా వెంటబడింది. ఈ అవకాశాన్ని ఉపయోగించు కొందామని వూరుకొన్నాను. శేఖరం కూడా దాన్ని వారించ లేదు. అది వెళ్ళిపోయింది.

బ్రతుకు జీవుడా అంటూ సోఫాలో కూలబడ్డాను. క్షణం గడవక ముందే రాజూ, రాణీ తయారు. వాటి ఆనందాన్ని ఎలా వర్ణించడం! ఒకటే గెంతడాలు. ఇల్లూ వాకిలీ తోటా దొడ్డీ చెడ తిరిగేస్తున్నాయి. అరెరే! ఏమిటీ ఈ విచిత్రం అన్పించింది నాకు.

రాజు ప్రేమ నిష్కల్మషమైంది. రాణి ప్రేమ పవిత్రమైంది అన్పిం చింది నాకు. నాకు రాణి ప్రేమ అంటే ఏమిటో ఈ మార్జాల దంపతులవద్ద నేర్చుకోవాలి మానవుడు అనుకొన్నాను.

ఈ విషయాన్నే ఉన్న దున్నట్లు శేఖరానికి చెప్పాను. వాడు నిజం.... నిజం.... అన్నాడు. క్షణం ఆగి ఇంకా ముందుంది కథ అన్నాడు.

ఇంకేముంది? ఎన్నో అవరోధాలను మరెన్నో ఆటంకాలను దాటుకొని ప్రేమ రాజ్యాభిషిక్తు డయ్యాడు రాజు. రాణి అదృష్టం చేసుకొన్నది, వాటి కేం అనుకొన్నాను,

ఆనందంగా గడిచాయి వాటి రోజులు. రాణి గర్భం ధరించింది.... శేఖరానికి చెప్పాను, ఆగు.... ఆగు... ఇంకా ముందుంది కథ అన్నాడు. ఐనా వేచి ఉండడం మంచి దనుకొన్నాను.

రాణి ప్రసవించింది. నాలుగు పిల్లలు పుట్టాయి. ఈ సంతోష వార్తను శేఖరానికి చెప్పాను'' కథ చాల దగ్గర పడింది, త్వరగా ముగిసిపోతుంది'' అన్నాడు. వాడి వాలకం మరీ విచిత్రంగా కన్పించింది. ''ఎందుకలా అంటున్నావ్?'' అన్నాడు. నువ్వు జంతువుల్లో ప్రేమనూ జాలినీ గొప్పగా చెబుతున్నావు. కానీ పిల్లి మానవత వుండని జంతువులే'. అన్నాడు.

నాకు అర్థం కాలేదు. వానితో వాదించడం నిరర్థక మన్పించింది.

వాడెప్పుడూ అంతే. వాడి ధోరణే అది.

రెండో రోజున రాణి ఎలా ఉందో చూద్దామని. పెరట్లోకి వెళ్ళాను. నాలుగు పిల్లల్లోనూ రెండే ఉన్నాయి. మిగిలిన రెండూ ఏమైనట్లు? అవ్వ నడిగాను.

" వాటిని అది చంపేసిందిరా " అన్నది అవ్వ.

" ఏది చంపేసింది? " ఆతురతో ఆవేదనతో అడిగాను.

" రాజు " అన్నది అవ్వ.

వాడి నాన్నే? పిల్లల్నే....

ఏమనుకోవాలి ... "తప్పు.... తప్పు చెబుతున్నావ్" అన్నాను అవ్వతో.

ఆమె ప్రశాంతంగా నవ్వుతూ "ఇందులో కొత్తేముందిరా. పిల్లి పిల్లల్ని చంపడాన్ని నువ్వు ఎరుగవూ?" అంటూ నావంక చూచింది.

నిజమేనా?

నే నెక్కడున్నాను?

భూమి కదలుతున్నట్లుంది. మసక మసకగా ఉన్నాయి కళ్ళు. శేఖరంలా ఉన్నాడు.,.... వాడే...... కథ ముగిసిందా? ప్రేమ కథ? అంటున్నాడు.

అవును. ముగిసింది. ప్రేమ కథ ముగిసిపోయింది.

